రూ.వెయ్యి ఇస్తేనే టీసీ

- 10 సంవత్సరాల కిందట ఓ విద్యార్థి పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివాడు. అప్పట్లో పలు కారణాల వల్ల ద్వితీయ సంవత్సరం చదవకుండా మానేశాడు. ప్రస్తుతం ప్రైవేట్ కంపెనీలో చిరు ఉద్యోగం కోసం మొదటి సంవత్సరం వరకు చదివిన టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) కోసం పీసీఆర్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఇదే అదునుగా ఆ కళాశాలలో రికార్డ్ అసిస్టెంట్ రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు సంబంధిత విద్యార్థి నుంచి డిమాండ్ చేసి వసూళ్లకు పాల్పడ్డాడు.
- ఇటీవల ఓ విద్యార్థి ఇంటర్మీడియట్ టీసీ కోసం దరఖాస్తు చేసుకుని పలుమార్లు ఆ కళాశాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాడు. అమ్యామ్యాల కోసం టీసీ సకాలంలో ఇవ్వకుండా తిప్పించుకున్నారు. దీంతో ఆ విద్యార్థి చేసేదేమీ లేక తన తల్లిని తీసుకుని కళాశాలకు వెళ్లాడు. అప్పటికీ టీసీ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో చివరికి రూ.వెయ్యి ఇచ్చి తీసుకెళ్లారు. ఇటువంటి బాధితులు ఆ కళాశాలలో చాలా మందే ఉన్నారు. ప్రతి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయి ఉత్తీర్ణత చెందిన విద్యార్థుల నుంచి ఇదే తంతు సాగుతున్నట్లు విమర్శలున్నాయి.

- పీసీఆర్ జూనియర్ కళాశాలకు కళంకం తెస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బంది
- టీసీ ఇవ్వాలంటే వెయ్యి చేతిలో పెట్టాల్సిందే
- పేద విద్యార్థుల నుంచి అడ్డగోలు వసూళ్లు
- అక్రమ వసూళ్లపై చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న ప్రిన్సిపల్, ఉన్నతాధికారులు



చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నో ఏళ్ల గొప్ప చరిత్ర ఉన్న పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొందరు కళంకం తెస్తున్నారు. పేరు ప్రఖ్యాతలున్న కళాశాలకు పరువు ప్రతిష్ఠలను పోగొట్టేలా అక్కడ పనిచేస్తున్న నాన్‌టీచింగ్ ఉద్యోగి వ్యవహరిస్తున్నారు. పేద విద్యార్థుల నుంచి అమ్యామ్యాలకు పాల్పడుతున్నారు. చదువు పూర్తి చేసుకునే విద్యార్థులతో పాటు మధ్యలో అనివార్య కారణాలతో చదువు మానేసిన వారి నుంచి ముడుపుల వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ఆ కళాశాలలో హాట్ టాపిక్‌గా మారింది. పలువురు తల్లిదండ్రులు సైతం టీసీల మంజూరు కోసం వెళ్తే ఈ ముడుపుల వ్యవహారం పట్ల పెదవి విరుస్తున్నారు.

ఉచితంగా ఇవ్వాల్సింది పోయి ముడుపులా ?

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఎటువంటి రుసుము తీసుకోకుండా టీసీ ఇవ్వాలన్నది ప్రభుత్వ నిబంధన. అయితే పలు కళాశాలలకు ఆదర్శంగా ఉండాల్సిన పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీసీల మంజూరుకు అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నారు. విద్యార్థి అవసరాన్ని బట్టి అమ్యామ్యాలకు పాల్పడుతున్నారు. అడిగినంతా ముట్టజెప్పిన వారికి త్వరగా, ఇవ్వలేని వారిని కళాశాల చుట్టూ తిప్పుకుంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఇవ్వాల్సిన అవసరం లేదు

టీసీ కోసం ఎవరూ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. పదేళ్ల లు పూర్తయిన విద్యార్థులు టీసీ కోసం వస్తే అటువంటి వారు మాత్రం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశించే నగదును చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అంతేగానీ మిగిలిన విద్యార్థులెవరూ టీసీల కోసం డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా టీసీలకు డబ్బులు అడిగితే నా దృష్టికి తీసుకురండి. అక్రమ వసూళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. ఫిర్యాదులు అందితే కఠినంగా చర్యలు తీసుకుంటాం.

- అబ్దుల్ మజీద్, ప్రిన్సిపల్,
పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల,
చిత్తూరు

టీసీ కావాలా.. వెయ్యి ఇచ్చుకో !

పీసీఆర్ కళాశాలలో పనిచేస్తున్న ఓ రికార్డ్ అసిస్టెంట్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రూ.వెయ్యి ఇస్తేనే టీసీ ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇంతవరకు గుట్టుచప్పుడు కాకుండా సాగిన ఈ టీసీల మంజూరులో అక్రమ వసూళ్ల బాగోతం బట్టబయలైంది. ఇటీవల తన కుమారుడి టీసీ కోసం రూ.వెయ్యి ఇచ్చుకున్నట్లు ఓ తల్లి లిఖిత పూర్వకంగా రాసిన లెటర్ సంచలనంగా మారింది. దీంతో ఆ పాఠశాలలో చదువుతున్న వందలాది మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల నుంచి ఏటా ఎంత మొత్తం వసూళ్లకు పాల్పడుతున్నారో తెలుస్తోంది. వెయ్యి రూపాయలు ఇచ్చుకోలేమని పలువురు విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. ఈ వసూళ్లను నియంత్రించి చర్యలు తీసుకోవాల్సిన ఆ కళాశాల ప్రిన్సిపల్, అదే కళాశాల ప్రాంగణంలో ఉండే ఇంటర్మీడియట్ డీఐఈఓ ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కాని దుస్థితి.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీన సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఎంపీడీఓ హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని చినకాంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వాతిసింధూర తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

రోడ్డులో గ్రానైట్ వ్యర్థాలు



చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో గంగసాగరం వద్ద పడేసిన గ్రానైట్ వ్యర్థాలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగర పరిధిలోని గంగసాగరంలో గ్రానైట్ రాళ్లను రోడ్డులో తెచ్చి పడేస్తున్నారు. చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో గంగసాగరం జ్యూస్ ఫ్యాక్టరీ ఎదురుగా పనికి రాని గ్రానైట్ బండలు, దిమ్మెలు పడేశారు. ఇదీ ప్రమాదకారిగా మారింది. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఏదైనా జరగకూడదని జరిగితే ఎలా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. స్థానికంగా ఉన్న చెరువులో గ్రానైట్ వ్యర్థాలను తోలేస్తున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

ఆలయాల మూత



మూసివేసిన మొగిలి శివాలయం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేసినట్లు ఈఓ మునిరాజ తెలిపారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని 3 గంటలకు మూసివేస్తున్నట్లు చెప్పారు. తిరిగి సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయ సంప్రోక్షణ నిర్వహించి యథావిధిగా శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారికి అభిషేక పూజలు, నైవేద్యం, హారతి సమర్పించిన తరువాత భక్తులకు సర్వదర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలు, 9 గంటలకు అభిషేకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఉదయం 7.30 గంటల నుంచి 9 మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు, 9.30 గంటలకు రుద్రాభిషేకం యథావిధిగా జరుగుతాయన్నారు.

వీరాంజనేయస్వామి దేవస్థానం మూసివేత

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి



అర్ధగిరి క్షేత్రం ఆలయ తలుపులు మూసివేస్తున్న ఆలయ సిబ్బంది, అర్చకులు

శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం 5 గంటలకు తలుపులు మూసివేశారు. ఆలయ అర్చకులు స్వామికి పూజలు చేయించారు. అనంతరం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా సాయంత్రం 5 గంటల నుంచి 8వ తేదీ సోమవారం ఉదయం 3 గంటల వరకు మూసివేస్తామని ఆలయ అధికారులు తెలిపారు. 4 గంటలకు ఆలయ తలుపులు తీసి శుద్ధి చేసి, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి 5 గంటల నుంచి యథావిధిగా ఆలయంలో స్వామిని దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు



అన్నదానం చేస్తున్న దాతలు

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్‌లోని బ్రహ్మానందాశ్రమంలో ఆదివారం శ్రీసత్యనారాయణస్వామి వ్రతపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి మూల విగ్రహానికి ఆశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని మండపంలో కొలువుదీర్చి స్వామివారి వ్రత పూజ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమానికి బోడబండ్లకు చెందిన చంద్రయ్య కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహక సభ్యులు, పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న అపుస్మా నాయకులు



ఉత్తమ ఉపాధ్యాయున్ని సత్కరిస్తున్న అపుస్మా నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు సీఆర్ మహేష్ రెడ్డి అన్నారు. అపుస్మా ఆధ్వర్యంలోని నగరంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు.

ఆదివారం కొంగారెడ్డి పల్లిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 70 మంది టీచర్లను దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీచింగ్ ప్రొఫెషన్ నోబెల్ ప్రొఫెషన్ అని అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత హెచ్‌ఎం రాజారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ గురువులు కేవలం బోధన చేయడమే కాకుండా శిష్యుల్లో ఆత్మజ్ఞానాన్ని, నైతిక విలువలను పెంపొందించి స్వీయ సాక్షాత్కారం వైపు నడిపిస్తారన్నారు. గౌరవ అధ్యక్షుడు ఎస్‌ఎస్‌కే రాజా మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంతో విశిష్టమైనదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, కృష్ణ, లక్ష్మిప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. నట్టేట ముంచి

- రైతులను మోసం చేసిన ప్రభుత్వం
- 9న ఆర్‌డీఓ కార్యాలయాల వద్ద నిరసన
- 'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణలో విజయానందరెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్

చిత్తూరు కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం రైతులను నమ్మించి, నట్టేట ముంచిందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ ఆరోపించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో 'అన్నదాతపోరు' పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రెండు నెలలుగా యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మొద్దు నిద్రలో ఉన్న సర్కారులో చలనం తీసుకువచ్చేందుకు ఈనెల 9వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆర్‌డీఓ కార్యాలయాల వద్ద రైతులతో కలిసి నిరసనకు దిగనున్నట్లు వెల్లడించారు. పలమనేరులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ్, నగరిలో మాజీ మంత్రి రోజా, కుప్పంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ఆందోళన చేపట్టనున్నట్లు వివరించారు. చిత్తూరులో తమతో పాటు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పాల్గొంటారన్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు చిత్తూరులోని గంగినేనిచెరువు నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంటామని తెలిపారు. అనంతరం నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు. రైతులు, నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. రైతులకు అందించాల్సిన యూరియాను కూటమి నేతలు కాజేసి బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, పెట్టుబడి సాయం పంపిణీ చేశామని, అందుకే ఐదేళ్లలో ఒక్కసారి కూడా అన్నదాత రోడ్డెక్కలేదని వివరించారు. ప్రస్తుతం కూటమి సర్కారును ప్రజలు నిలదీసే రోజులు వచ్చాయని స్పష్టం చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, గుడిపాల అధ్యక్షుడు ప్రకాష్, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శులు గాయత్రీదేవి, లీనారెడ్డి, ఉద్యోగులు, పెన్షనర్ల రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, చిత్తూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నేతలు రెడ్డిశేఖర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, చాంద్‌బాషా, అంజలి రెడ్డి, భాగ్యలక్ష్మి, హరీషారెడ్డి, నారాయణ, ప్రతిమా రెడ్డి, చక్రీ, మురళీ, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

మూగరోదన





దాహార్తిని తీర్చుకుంటున్న వానరాలు

గుడిపాల: మూగజీవాలు గుక్కెడు నీటి కోసం విలవిల్లాడుతున్నాయి. గత కొన్ని రోజులుగా సూర్యుడి తాపం అధికమైంది. దీంతో తాగునీరు ఎక్కడా దొరకట్లేదు. అందులో భాగంగా వానరాలు సైతం తాగునీరు దొరక్క ఇబ్బంది పడ్డాయి. ఆదివారం తాగునీటి కోసం వానరాలు పడుతున్న ఇక్కట్లను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. నరహరిపేట వద్ద ఓ ట్యాంక్ వద్ద వాటర్ బాటిల్‌లో నీటిని వానరం తీసుకుని తాగింది. అలాగే వసంతాపురం సచివాలయం సమీపంలోని ఓ తొట్టి వద్ద కొళాయి ట్యాప్‌ను ఆన్ చేసుకుని మరీ దాహార్తిని తీర్చుకుంది.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి



విద్యార్థినికి ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేస్తున్న మాజీ వీసీ బాలవీరారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఇంజినీరింగ్ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంచుకోవాలని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ బాలవీరారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల రెండవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు మించి నేటి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పెంచుకోవాలన్నారు. ఏఐ ప్రాముఖ్యత, అందులో రానున్న వేలాది ఉపాధి అవకాశాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. చైర్మన్ రంగనాథం ఇంజినీరింగ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌కేడిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు, జేఎన్‌టీయూఏ అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు యూరియా పంపిణీ

యాదమరి: అన్నదాతల అవసరం దృష్ట్యా మండల పరిధిలోని 184 గొల్లపల్లి, బోదగుట్టపల్లి రైతు సేవా కేంద్రాల్లో సోమవారం యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏఓ దీప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 300 బస్తాల మేర యూరియా వచ్చిందని.. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని కోరారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని ఇతర రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ కానుందని రైతులు సహకరించాలని పేర్కొన్నారు.

చెస్ టోర్నీలో చిత్తూరు క్రీడాకారుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న చిత్తూరు చెస్ క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతి జిల్లా గూడూరు వద్ద ఉన్న నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన చెస్ ర్యాకింగ్ టోర్నమెంట్‌లో చిత్తూరు క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ మేరకు ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్ విలేకరులకు ఆ వివరాలు వెల్లడించారు. ఏపీ స్టేట్ చెస్ ర్యాకింగ్ టోర్నమెంట్‌లో చిత్తూరు నగరానికి చెందిన క్రీడాకారులు అండర్-8 విభాగంలో ప్రతిభ చాటారని తెలిపారు. వివిధ విభాగాల్లో నగరానికి చెందిన ఎస్‌ఆర్ ఆర్యన్, అనంత్ నిత్య, నాగమోహిత్, రామ్‌తేజ బహుమతులు సాధించారన్నారు. అనంతరం ఆ విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

డబ్లింగ్ పనుల పూర్తికి మోక్షం

- తిరుపతి- కాట్పాడి పనులకు గెజిట్ విడుదల చేసిన కేంద్రం
- డబ్లింగ్ పనుల ఆలస్యంపై దృష్టి
- భూసేకరణ చేపట్టాలని మరోమారు ఆదేశాలు
- రూ.1,332 కోట్లతో 104 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులకు అంగీకారం



చిత్తూరు కార్పొరేషన్: దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించనట్లుగా మారింది తిరుపతి-కాట్పాడి డబ్లింగ్ పనుల పరిస్థితి. ఏప్రిల్‌లో ఈ డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దశాబ్దాల నాటి కలకు మోక్షం లభించింది. మొత్తం 104 కిలోమీటర్ల పనులకు రూ.1,332 కోట్లతో చేయడానికి అంగీకారం తెలిపింది. దీంతో చిత్తూరు, తిరుపతి జిల్లాతో పాటు వేలూరు జిల్లావాసులు ఆనందం వ్యక్తం చేశారు. తదుపరి భూ సేకరణకు మొదట సర్వే చేయాలి. అవి ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో ఆ పనులు చేయాలని కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇకనైనా పనులు వేగవంతం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆలస్యంగా పనులు

ఎందుకో కేంద్ర శాఖల పరిధిలో పనులంటే అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం స్పష్టంగా కనిపిస్తాయి. అమృత్‌భారత్ పథకం కింద చిత్తూరు రైల్వేస్టేషన్‌లో రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఆ పనుల్లో వేగం లేకపోయినా పట్టించుకునేవారు లేదు. అలాగే రూ.1,332 కోట్లతో డబ్లింగ్ పనులకు అనుమతులు వచ్చినా భూ సేకరణ సర్వేని రెవెన్యూ అధికారులు తిరుపతి-పాకాల వరకు చేసి ఆపేశారు. అక్కడ నుంచి కాట్పాడి వరకు పనులు ప్రారంభించలేదు. దీనిపై మరోమారు తిరుపతి, చిత్తూరు తమిళనాడులోని వేలూరు జిల్లాల్లో భూ సేకరణ పనులు చేపట్టాలని ఉత్తర్వులు రావడంతో అధికారుల్లో కదలికలు వచ్చాయి.

సింగిల్ లైన్‌తో నరకం..

తిరుపతి-కాట్పాడి మధ్య దాదాపు 10 స్టేషన్ల మీదుగా దాదాపు నిత్యం 400 గ్రామాల నుంచి వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో ఎక్కువగా గోల్డెన్‌టెంపుల్, కాణిపాకం, తిరుచానూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, తిరుమల ఆలయాలకు వేలాదిమంది భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. లైన్ డబ్లింగ్ చేయడం వల్ల ప్రయాణ సమయం తగ్గి రైళ్ల రాకపోకలు పెరగనున్నాయి. సింగిల్ లైన్ కారణంగా రైళ్ల వెయిటింగ్‌తో ప్రయాణికులకు నరకం తప్పడం లేదు. ఈ మార్గంలో దాదాపు రోజు 40 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒకే లైన్ ఉండడం వల్ల చిత్తూరులో ముఖ్యమైన రైళ్లు ఆగడం లేదు. ప్రయాణికులు కాట్పాడి, పాకాల, తిరుపతిలో దిగాల్సిందే. ఈ పనులు పూర్తయితే పారిశ్రామిక, పర్యాటక, ఆధ్యాత్మిక రంగాలు అభివృద్ధి చెందుతాయి. గ్రానైట్, మామిడి ఉత్పత్తుల రవాణా పెరుగుతుంది. ఈ లైన్‌ను రెండు వరుసలుగా విస్తరణ చేసేందుకు మార్చిలోపు రైల్వేశాఖకు స్థలాన్ని అప్పగించే విధంగా రెవెన్యూ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈలోపు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు.